జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 26 | మే | 2025 ◆ పేజీలు : 5

## నూతనంగా నియమితులైన ఆర్టిఐ కమిషనర్ ను కలిసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

- గ్రామ పాలనాధికారుల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 25, ప్రజా జ్యోతి :** ఇటీవల నూతనముగా ఆర్టి ఐ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన పీవీ శ్రీనివాసరావు మొదటిసారిగా భద్రాద్రి, కొత్తగూడెం జిల్లాకు విచ్చేసిన ఆర్టిఐ కమిషనర్ పివి శ్రీనివాసరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదివారం సింగరేణి గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అం దజేశారు . అనంతరం వారిరువురు జిల్లా ప్రజల సమస్యలపై, అభివృద్ధిపై మిగతా 2 లో...

## కిన్నెరసాని మోడల్ క్రీడ ప్రాంగణంలో

# ఘనంగా ప్రారంభమైన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్





- క్రికెట్ పోటీలో పాల్గొన్న ఐటీడీఏ, ఏటీడీవో ఉద్యోగస్తులు
- ఆటవిడుపు క్రీడలు ఉద్యోగస్తులకు ఎంతగానో ఉల్లాసానిస్తాయి
- ఐటీడీఏ పీవో రాహుల్

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 25, ప్రజా జ్యోతి :** పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని మోడల్ క్రీడ పాఠశాలలో ఆదివారం ఐ టి డి ఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ ఆధ్వర్యంలో ఐ టి డి ఏ లో పని చేస్తున్న ఉద్యోగస్తులు, ఏటీడీవో ఉద్యోగస్తులు కలిసి ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిరోజు తాను పనిచేసే కార్యాలయంలో అధికారులు ఆకస్మిక పర్యటనలకు వెంట వెళ్లి విధి నిర్వహణలో బాధ్యతగా పనిచేసే ఇంటి సభ్యుల పట్ల కూడా సమయం కేటాయించలేక సతమవుతున్న ఉద్యోగులకు సరదాగా ఉంటుందని, ఉద్దేశంతో ఐటీడీఏ పీవో రాహుల్ ఆధ్వర్యంలో ఆట విడుపు క్రికెట్ క్రీడ పోటీలను చేపట్టగా ఈ పోటీలను పిఓ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఆటవిడుపు క్రీడలు ఉద్యోగస్తులకు ఎంతగానో ఉల్లాసానిస్తాయని, అదే విధంగా ఇలాంటి క్రీడలు ఆడటం వల్ల మేధాశక్తిని పెంచి విధి నిర్వహణలో బాధ్యతగా సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యాలయం లో పనిచేసే అధికారులతో పాటు తన సిబ్బంది ప్రతిరో జూ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రముఖులకు, గిరిజన ప్రజలకు వారికి కావలసిన పనులు చేసి పెట్టి విధి నిర్వహణలో అలసి సొలసి ఉన్న ఉద్యోగస్తుల కు ఇలాంటి క్రీడలు మిగతా 2 లో...

## యువత క్రీడలపై దృష్టి పెట్టండి



- మానసిక, శారీరక దృఢత్వం ఏర్పడుతుంది
- మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటన
- వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం, అభివృద్ధి పనుల పరిశీలన

**ములకలపల్లి, మే 25, ప్రజా జ్యోతి:** అశ్వారావుపేట శాసనసభ్యులు శ్రీ జారె ఆదినారాయణ ఆదివారం ములకలపల్లి మండలంలో పర్యటించి వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. రింగిరెడ్డిపల్లి గ్రామంలో గ్యాంగ్ వార్ యూత్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, క్రీడాకారులలో స్నేహభావం, క్రమశిక్షణ పెంచడానికి ఇటువంటి పోటీలు కీలకమని పేర్కొన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి, విద్య, క్రీడలపై దృష్టి పెట్టాలని అన్నారు. గ్యాంగ్ వార్ యూత్ సంఘం యొక్క సామాజిక సేవలను ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అనంతరం చౌతిగూడెం వద్ద నిర్మిస్తున్న చప్టా పనులను మిగతా 2 లో...

## ఉస్మానియా అభివృద్ధికి సహకరించడం సింగరేణికే గర్వకారణం

- తెలంగాణ ప్రాంత విద్యాభివృద్ధికి సింగరేణి పూర్తి సహకారం
- సీఎండీ ఎన్. బలరామ్
- ఈ సీ ఈ భవంతిని ఉస్మానియా వీసీ శ్రీ కుమార్ తోకలిసి ప్రారంభించిన సీఎండీ



**కొత్తగూడెంసింగరేణి , మే 25,ప్రజాజ్యోతి :** వందేళ్లకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో తరగతి గదుల నిర్మాణానికి సహకరించడం తమ సంస్థకు ఎంతో గర్వకారణంగా ఉందని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. తెలంగాణలో మిగతా 2 లో...

## తహశీల్దార్, ఆర్ఐలకు ఫోన్ చేసి బెదిరింపు



**టేకులపల్లి, మే 25, ప్రజాజ్యోతి :** ఏసీబీ అధికానంటూ తహశీల్దార్, ఆర్ఎలకు ఫోన్ చేసి ఒకరికి తెలియకుండా మరొకరిని బెదిరించడంతో రూ.98 వేలు తహసీల్దార్ ముత్తయ్య ఫోన్ పే చేయడం జరిగింది. వివరాలలోకి వెళ్తే టేకులపల్లి రెవిన్యూ కార్యాలయంలో ఆర్ఐ 1గా పని చేస్తున్న రత్తయ్యకు 9663860633 అనే నెంబర్ నుంచి మంగళవారం మధ్యాహ్నం కాల్ చేసి పేరు, వివరాలు అడగడం జరిగింది. ఎంత కాలం నుంచి పని చేస్తున్నారని, నేను ఏసీబీ డీఎస్పీ అని మీ తహశీల్దార్ కు ఫోన్ కలిపినపుడు ఎస్పీ ఫోన్లో ఉంటాడని, ఏసీబీ అధి కారులు వచ్చారని చెప్పాలని అన్నట్లు తెలిపారు. వెంటనే తహశీల్దార్ కు ఫోన్ చేసి మీ ఆర్ ఏసీబీకి దొరికాడని, అతడి పేరుతో పాటు మీ పేరు కూడా కలుపుతామని తహశీల్దార్ ముత్త య్యకు ఫోన్ లో ఆడినట్లు పేర్కొన్నారు. అలాగే నీ పేరు చేర్చకుండా ఉండాలంటే రూ. 2 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో, బయపడిన తహశీల్దార్ 7483247988 నెంబర్ కు మొదటి విడతగా రూ.50వేలు పం పారు. అలాగే ముందుగా తెలిపినట్లు ఆర్ఐ రత్తయ్యకు ఫోన్ చేసి తహశీల్దార్ కాన్సరెన్స్ లో ఎస్పీని మాటాడుతున్నాడని, ఆర్ఐ మా ఏసీబీ అధికారులు మీ దగ్గర ఉన్నారా అని ఫోన్ లో అడిగారని, దింతో రత్తయ్య ఉన్నట్లు చెప్పారన్నారు. మళ్లీ తహసిల్దార్ కి ఫోన్ చేసి డబ్బులు సరిపోలేదని అనగా అదే నెంబర్ కు మరోమారు రూ. 48 వేలు ఫోన్ పే ద్వారా పంపారు. అనంతరం తహసిల్దార్, ఆర్ఐలు జరిగిన విషయంపై ఫోన్ లో మాట్లాడగా ఏసీబీ అధికారులు రాలేదని తెలుపగా, తహసీల్దార్ ముత్తయ్య వెంటనే సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై తహసిల్దార్ , ఆర్ఐలు మాట్లాడుతూ ఒకరికి తెలియకుండా మరొకరికి ఫోన్ చేసి ఆందోళన గురిచేసారని, తహసిల్దార్ మరో 12 రోజుల్లో రిటైర్ అవుతున్నానని చివరి దశలో ఇలా మోసపోతానని అనుకోలేదన్నారు. దీనిపై సోమవారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తామన్నారు.

## నూతనంగా నియమితులైన ఆర్టిఐ కమిషనర్ ను కలిసిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

(మొదటి పేజీ తరువాయి...)



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 25, ప్రజా జ్యోతి :** చర్చించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ కొత్తగూడెంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్ సింగరేణి పాఠశాలలో నిర్వహిస్తున్న గ్రామ పాలనాధికారుల నియామక పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉస్మానియా అభివృద్ధికి సహకరించడం సింగరేణికే గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి...)





**కొత్తగూడెంసింగరేణి , మే 25,ప్రజాజ్యోతి :** విద్యా రంగాన్ని ఆధునికీకరించాలన్నరాష్ట్రప్రభుత్వలక్ష్యానికి అనుగుణంగా సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి తన వంతు సహకారాన్ని ఎప్పుడూ అందిస్తూ వస్తోందని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లో డిపార్ట్మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ శాఖ లో దాదాపు రెండు కోట్ల రూపాయల సింగరేణి సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన తరగతి గదుల కాంప్లెక్స్ ను ఆయన యూనివర్సిటీ ఉప కులపతి శ్రీ కుమార్ మొలుగారం తో కలిసి ప్రారంభించారు. సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియాలో ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మైనింగ్ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించడానికి కూడా పూర్తిస్థాయిలో సహకరించిందని, అలాగే ప్రస్తుత ఉస్మానియాలోని మైనింగ్ ఇంజినీరింగ్ విభాగంలో సింగరేణి తరపున అధ్యాపకులను కేటాయించిందని, ప్రొఫెసర్ ఛైర్ పథకం కింద నిధులు కూడా కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. ఇవే కాకుండా పెద్దపల్లి జిల్లాలో జేఎన్టీయూ కళాశాల ఏర్పాటుకు పూర్తి సహకారం అందించినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతి శ్రీ కుమార్ మొగులారం మాట్లాడుతూ 13 దశాబ్దాల చరిత్ర గల సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతానికి గర్వకారణమని, ఉస్మానియా యూనివర్సిటీకి సింగరేణి అందించిన ఆర్థిక సహాయం మరువలేనిదన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో మైనింగ్ బోధన తిరిగి ప్రారంభించేందుకు కూడా పూర్తి సహకారం అందించిందని కొనియాడారు. ఇకపై కూడా సింగరేణి తన సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్, ఈసీఈ విభాగ అధిపతి ప్రొఫెసర్ డి.రామకృష్ణ, సింగరేణి అధికారులు ఎన్.భాస్కర్, జి.రమేశ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కిన్నెరసాని మోడల్ క్రీడ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమైన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

- క్రికెట్ పోటీలో పాల్గొన్న ఐటీడీఏ, ఏటీడీవో ఉద్యోగస్తులు
- ఆటవిడుపు క్రీడలు ఉద్యోగస్తులకు ఎంతగానో ఉల్లాసానిస్తాయి
- ఐటీడీఏ పీవో రాహుల్





(మొదటి పేజీ తరువాయి...)

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 25, ప్రజా జ్యోతి :** మనసుకు ఉల్లసానిస్తాయని, ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం వల్ల శారీరకంగా మానసిక ఒత్తిడి నుండి దూరంగా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం పలువురు ఉద్యోగస్తులు మాట్లాడుతూ ఐటీడీఏ పీవో రాహుల్ బాధ్యతలు చేపట్టి దాదాపు 11 నెలల కాలంలోనే గిరిజన కుటుంబాల అభివృద్ధి పట్ల ఎంతో కృషి చేస్తున్నారని, గిరిజన విద్యార్థుల విద్యాభ్యాసం మెరుగుపరిచేందుకు ఎన్నో రకాల ప్రణాళికలు తయారుచేసి వారి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. అందుకు నిదర్శనం ఏడాది గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల వసతి గృహంలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థుల ఫలితాలే ఎందుకు నిదర్శనమని ఉద్యోగస్తులు అభివర్ణించారు. అదేవిధంగా అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలను ప్రాచుర్యంలోకి తేవడానికి ఐటీడీఏ భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటుతోపాటు ఆర్గానిక్ ఫుడ్ కూడా అందుబాటులో తీసుకువచ్చిన ఘనత ఐటిడిఏ పిఓ రాహుల్ కే దక్కుతుందని అన్నారు, గిరిజనులకు అనేక రకాల సేవలు చేస్తున్న ఉద్యోగాలలో ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని నింపాలని నూతన వరవడిని తీసుకు రావడం ఉద్యోగుల నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి టోర్నమెం ట్స్ ఏర్పాటు చేసినందుకు ఉద్యోగ స్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏటీడీవోల జోన్లుగా నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్లో హోరాహోరీగా జరిగిన పోటీలలో భద్రాచలం ఏటీడీఓ టీం పై భద్రాచలం ఐటిడిఏ పిఓ క్రికెట్ టీం కప్పును కైవసం చేసుకుంది, టీం రన్నర్ గా ఏ టి డి ఓ భద్రాచలం టీం నిలవగా ఈ క్రికెట్ టోర్నమెంట్ కు ఐ టి డి ఏ భద్రాచలం కార్యాలయం స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు ఆధ్వర్యం లో ఈ క్రీడా పోటీలు నిర్వహించగా టోర్నమెంటుకు అంపైర్లుగా రామారా వు, వెంకటేశ్వర్లు వ్యవహరించారు. గెలు పొందిన టీంకు ఐటిడిఎపిఓ రాహుల్ బహుమతులను అందజే శారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఏటీడీవో చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, ఏ ఎస్ ఓ వెంకటనారాయణ, నాగేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ శంకర్, ఏవో బాలు, పి వెంకటేశ్వర్లు, హరికృష్ణ, వార్డెన్ కబీర్ పాల్గొన్నారు.

# యువత క్రీడలపై దృష్టి పెట్టండి





(మొదటి పేజీ తరువాయి...)

ములకలపల్లి, మే 25, ప్రజా జ్యోతి: పరిశీలించి, వర్షాకాలం రాకముందే పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్, రోడ్డు డివైడింగ్ అభివృద్ధి పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్లపై ఎక్కడ మురుగునీరు నిలబకుండా చర్యలు తీసుకోవాలని, విద్యుత్తు సరఫరా లో అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. చౌటిగూడెం గ్రామంలో జరుగుతున్న శ్రీ శ్రీ అంకమ్మ అమ్మవారి జాతరలో పాల్గొని భక్తులతో కలిసి తీర్థప్రసాదం స్వీకరించారు. వీకే రామవరంలో విద్యుత్ షాక్ తో మృతి చెందిన అరవింద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పూసుగూడెంలో రోడ్డు ప్రమాదం లో గాయపడిన నందు పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు .మాజీ జెడ్పిటిసి బత్తుల అంజి, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, నాయకులు కారంసుధీర్ కుమార్, కీసర సమ్మయ్య, సున్నం సుధాకర్, కుంజా రవి, కోండ్రు భాస్కర్, కీసరి శ్రీను, మడకం చిరుమప్ప, గ్యాంగ్ వార్ యూత్ వాలీబాల్ టోర్నీ నిర్వాహకుడు కొండ్రు అనిల్, చౌటుగూడెం ఆలయ కమిటీ పూజారి కాక ఆదినారాయణ స్వామి, కాక లక్ష్మీ, శనగపాటి రవి, ఉమేష్ అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పాలకుర్తి సుమిత్ ములకలపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొడిమ వంశీ అడ్వకేట్ ఊకే రవి తదితరులు పాల్గొన్నారు

# పశువుల అక్రమ రవాణాలను అరికట్టాలి

- బీఎస్పీ చర్ల మండల అధ్యక్షుడు కొండా చరణ్





**చర్ల, మే25, ప్రజాజ్యోతి :** చర్ల మండలంలో ఆవుల అక్రమ రవాణా రోజు రోజుకి విపరీతంగా పెరిగిపోతుందని తక్షణమే ఈ అక్రమ రవాణాని అధికారులు అరికట్టాలని బీఎస్పీ చర్ల మండల అధ్యక్షుడు కొండా చరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నిబంధనలను తుంగలో తొక్కుతూ అధిక సంఖ్యలో ట్రాలీలలో లారీల ల్లో పశువులను అత్యంత దారుణంగా కుక్కి కుక్కి మెడలు విరిచి కాళ్ళు కట్టేసి నీరు లేకుండా గడ్డి పెట్టకుండా అత్యంత హింసాత్మకంగా పశువుల రవాణా చర్ల మండల కేంద్రంగా కొనసాగుతుందని మండిపడ్డారు. అతి పవిత్రంగా భావించే ఆవులు అక్రమ రవాణాకు గురి కావడం పట్ల చర్ల మండల హిందూ సమాజం ఆందోళన వ్యక్తం చేస్తుందని అన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఆవుల అక్రమ రవాణా జరుగుతుంటే స్థానిక అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. సంత పాటదారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు విస్తృతంగా ప్రజల్లో ప్రచారం జరుగుతుందని తెలిపారు. అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆవుల అక్రమ రవాణాని అరికట్టాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. చర్ల నుండి ములుగు వైపుగా హైదరాబాదుకు ఈ పశువులను తరలిస్తున్నారని అన్నారు. అధికారులు ఈ విషయాన్ని చూసి చూడనట్లు ఉండడంతో కొందరు అక్రమార్కులు ఎటువంటి భయం లేకుండా యథేచ్ఛగా మూగజీవాలను అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కొన్నిసార్లు ప్రజలు ఫిర్యాదు చేస్తున్నప్పటికీ చర్యలు శూన్యంగా ఉంటున్నాయని అన్నారు. ఒక్కోసారి వార్తలు రాస్తున్న విలేకరులపై కూడా దాడులకు దిగుతు న్నారని అన్నారు. కేవలం ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే జరగవలసిన పశువుల సంత చర్లలో నిరంతరం ప్రతి రాత్రి యథేచ్ఛగా కొనసాగుతుందని తెలిపారు. పంచాయతీ చూపించిన పరిమిత ప్రదేశాల్లో కా కుండా మండలంలో ఇతర ప్రాం తాలలో కూడా ఆవులను అధిక సంఖ్య లో కట్టేస్తున్నారని పశువుల క్రయవిక్రయాలపై కేంద్రం ఎన్నో నిబంధనలు విధించినప్పటికీ ఏమి కూడా పాటిస్తు న్నట్టు కనిపించడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా బహిరంగ ప్రదే శాల్లో కొన్ని చోట్ల ఆవులు, ఎద్దులు, గేదలను కళేబరాలకు విక్రయాలు చేస్తున్నారని వాటిని హైదరాబాద్ కి తరలిస్తున్నారని తెలుస్తోందని అ న్నారు. అధికారులు తప్పనిసరిగా ఈ విషయంపై దృష్టిసారించాలని కోరారు. పశు రవాణా చట్టం 1978 ద్వారా పశువులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే మండల స్థాయి తీర్మానం చేయాల్సి ఉంటుందని ఒక ట్రాలీ అయితే రెండు పశువులు, లారీ అయితే నాలుగు పశువులను మాత్ర మే ఎక్కించాలని వాటికి నీరు, మేత తప్పకుండా ఉండాలని ప్రతి అరగం టకు ఒకసారి పశువులను వాహనం దింపి సేదతీరే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గర్భంతో ఉన్న పశువులను ఎట్టి పరిస్థితుల్లో తరలించకూడదని అలా కాదని రవాణా చేస్తే ఆ వాహనాన్ని పోలీసులు సీజ్ చేయాలని తరలిస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అయితే ఇక్కడ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని జరుగుతున్న పరిణామాల దృష్ట్యా అర్థమవుతుం దని, అధికారుల నిర్లక్ష్యం కారణంగా చర్ల మండల కేంద్రం నుంచి భారీ ఎత్తున గోవులు చర్ల మండలం నుండి జిల్లాలకు రాష్ట్రాలకు తరలిస్తున్నారని అన్నారు. తక్షణమే ఈ అక్రమ రవా ణాని ఉన్నతాధికారుల జోక్యం చేసు కొని నిలిపివేయాలని అక్రమ పశువుల రవాణాదారులపై కఠినమైన చర్యలు తీసుకొని మూగజీవాలను అక్రమ రవాణా దారుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. లేని ఎడల గోవుల రక్షణ కొరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## విద్యార్థులు లేరనే నెపంతో గురుకులాలను మూసివేయడం హేయమైన చర్య

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు



**టేకులపల్లి, మే25, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని 12 ఇంటర్మీడియట్ గురుకులాలను విద్యార్థులు లేరనే నెపంతో సర్కారు మూసివేయాలని చూస్తోందని వారు తెలిపారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనుకకు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొ త్తగూడెం జిల్లా కార్యదర్శి బయ్య అభిమన్యు డిమాండ్ చేశారు. ఆదివారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గురుకులాలలో పేద, బలహీన వర్గాల నుండి వచ్చిన విద్యార్థులు చదువుతున్నారని వీటిని మూసి వెయ్యడం ద్వారా వారు విద్యకు దూరం అవుతారని వారు అ న్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను మూసి వేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యసంస్థ లకు కట్టబెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని వారు మండి పడ్డారు. ఈ మూసివేసే విద్యాసంస్థలలో భద్రాచలం గురుకులం కూడా ఉందని ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ఇందులో చదువుతున్నారని దీనిని మూసివేయడం ద్వారా వారి తమ విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉంది అని వారు అన్నారు. ప్రభు త్వ విద్య వ్యవస్థను అభివృధి చేయాల్సిన ప్రభుత్వమే వాటిని మూసివేయడం సిగ్గుచేటు అని, ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనుకకు తీసుకోవాలని లేదంటే ఆందోళనలు చేపడతామన్నారు.

## ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఏరియా జిఎం వీసం. కృష్ణయ్య



**ఇల్లందు అర్బన్, మే 25, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా జిఎం వీసం. కృష్ణయ్య కోరారు. ఆదివారం స్థానిక జిఎం కార్యాలయంలో ఏరియాలోని అన్ని గనులు, విభాగాల అధిపతులతో వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో ఉదయం జాతీయ పతాకాన్ని ఎగరవేయాలని, గనులు, కార్యాలయాలలో మామిడి తోరణాలతో కొబ్బరి ఆకులు, అరటి చెట్లు, రంగురంగుల విద్యుత్ దీపాలు, రంగు కాగితాలతో అలంకరించాలని సూచించారు. తెలంగాణ పరుగులో అధిక సంఖ్యలో పాల్గొనాలని, సాయంకాలం జెకె కాలనీ లోని బ్లాక్ డైమండ్ స్టేడియంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల ప్రదర్శనశాలలు, తెలంగాణ రుచులను తెలిపే తినుబండారాల శాలలు తెలంగాణ సాంస్కృతిని తెలిపే సాంస్కృతిక కార్యక్రమాలు ఉండాలని సూచించారు. ఈ వేడుకలకు హాజరై ఉద్యోగులు వారి కుటుంబాలు సంతోషించేలా వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేసి వేడుకలను ఘనంగా నిర్వహించాలని, అందుకు కావలసిన ప్రణాళికను రూపొందించుకోవాలని సంబంధిత అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో ఎస్ఓటూ జియం రామస్వామి, ఏజి ఎం (ఐఇడి) యం. గిరిధర్ రావు, జెకె ఓసీ పిఓ కృష్ణ మోహన్, డిజిఎం (పర్సనల్) జివి. మోహన్ రావు, డిజిఎం (సివిల్) రవి కుమార్, ఈఈ (వర్క్ షాప్) పి. పవన్ కుమార్, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బాలిక అదృశ్యం పై పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు

**ములకలపల్లి, మే 25 ,ప్రజా జ్యోతి:** బాలిక అదృశ్యమైన ఘటన పై ములకలపల్లి పోలీస్ స్టేషన్ లో శనివారం కేసు నమోదు అయ్యింది. ఎస్సై కిన్నెర రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం అయినా తిరిగి రాకపోవడం బాలిక కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు స్థానిక ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సీనియ ర్ జర్నలిస్టు మునీర్ మరణం తెలంగాణకు తీరనిలోటు

- సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్



**కొత్తగూడెం సింగరేణి, మే 25, ప్రజాజ్యోతి :** సింగరేణి మాజీ ఉద్యోగి, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమ సమయంలో సకలజనుల సమ్మెలో సింగరేణి విభాగానికి కన్వీనర్ గా, పలు సమాజ హిత ఉద్యమాలలో కీలక భూమిక పోషించిన మునీర్ మరణం పాత్రికేయ రంగానికే గాక తెలంగాణ సమాజానికి తీరని లోటని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ పేర్కొన్నారు. మునీర్ పాత్రికేయుడిగా పనిచేస్తూ, కార్మిక పక్షపాతిగా అనేక సింగరేణి కార్మిక సమస్యలను ఎప్పటికప్పుడు యాజమా న్యం దృష్టికి తీసుకొచ్చారని, చివరి వరకు పాత్రికేయులుగానే కొనసాగుతూ అనేక సామాజిక అంశాలను విశ్లేషిస్తూ ప్రజా సేవ చేశారన్నారు. ఆయన అకాల మరణం పట్ల తీవ్ర సంతా పం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్



**భద్రాచలం, మే 25,ప్రజాజ్యోతి :** భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం తెలిపారు. ఈ గిరిజన దర్బార్ 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశమందిరంలో జరుగుతుందని, అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. గిరిజనులు వారి సమస్యలకు సంబంధించి అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు అందించాలని తెలిపారు.

## రామయ్యను దర్శించుకున్న రాష్ట్ర ఆర్టీఐ కమీషనర్,ఎమ్మెల్సీ అద్దంకి





**భద్రాచలం, మే 25, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర ఆర్టీఐ కమీషనర్ పీవీ శ్రీనివాస్ ఆదివారం దర్శించున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయన్ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గర్భగుడిలో పూజలు నిర్వహించగా అర్చకులు వేదాశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంలోని ఉప ఆలయాలు శ్రీ అభయాంజనేయ స్వామి, లక్ష్మీతాయారు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టను వివరించారు. అదేవిధంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , మే 25, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చన అర్చకులు జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పాల్గొన్న భక్తులు మురిసిపోయారు. అర్చకులు తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోకంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

## రామయ్య ఆలయానికి వెండి పళ్లెం బహుకరణ



**భద్రాచలం కల్చరల్ , మే 25, ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానానికి దాతలు వెండి పళ్లెం బహుకరించారు. ఏపీలోని భీమవరం గ్రామానికి చెందిన భాస్కర్రావు, లక్ష్మి, పద్మావతి దంపతులు స్వామివారికి 460 గ్రాముల రూ.43,700 విలువైన వెండి పళ్లెంను బహుకరించగా దానిని ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రమాదేవితో పాటు ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మీసేవ నిర్వాహకుల నూతన కమిటీ ఏర్పాటు



**పాల్వంచ (రూరల్), మే 25,ప్రజా జ్యోతి :** పాల్వంచ లో అనుబోస్ ఇంజనీరింగ్ కాలేజ్ లో జరిగిన మీసేవ నిర్వాహకుల ఆత్మీయ సమ్మేళనానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అందరూ మీసేవ నిర్వాహకులు పాల్గొన్నారు. అందులో భాగంగా భద్రాద్రి జిల్లా తెలంగాణ మీసేవ ఫెడరేషన్ నూతన కమిటీ ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది.కాగా ఈ కార్యక్రమానికి తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు భైర శంకర్ రాష్ట్ర మీసేవ నాయకులు పాల్గొన్నారు. వీరితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా మీసేవ నాయకులు కూడా హాజరయ్యారు. తెలంగాణ మీసేవ ఫెడరేషన్ భద్రాద్రి జిల్లా కమిటీ కి ప్రెసిడెంట్ గా కె. నరేష్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ గా భూక్యా రంజిత్ నాయక్ ,వెలమ రాజేందర్, జనరల్ సెక్రటరీ గా బెల్లంకొండ రామారావు, ట్రెజరర్ గా మీసేవ ప్రసాద్, మరికొంత మంది నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

# తెలంగాణ ఆర్టిఐ కమిషనర్ పి. వి శ్రీనివాస్





**భద్రాద్రి కొత్తగూడెం, మే 25, ప్రజాజ్యోతి :** సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధంలా పనిచేస్తుందని దీనిని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ ఆర్టిఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి లోని ఎస్ ఎస్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో జరిగిన సభకు ఆయన హాజరయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జర్నలిస్టులు, ఆత్మీయుల ఆధ్వర్యంలో ఆత్మీయ పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేపర్ బాయ్ స్థాయి నుంచి ఈరోజు తెలంగాణ సమాచార హక్కు కమిషనర్ గా సాగిన సుదీర్ఘ ప్రయాణాన్ని ప్రస్తావించారు . ఎన్నో సమస్యలతో ఎవరికీ చెప్పుకోవాలో తెలియని పరిస్థితుల్లో 50% జనాభా నేటికీ ఉన్నారనేది వాస్తవం అని అన్నారు . సామాన్యుడి గళానికి దక్కిన గౌరవమే ఈ సమాచార శాఖ ఆర్టిఐ కమిషనర్ పదవి అని సామాన్యుడు నుంచి సమస్యలు తీరే వరకు జవాబుదారీగా ఉంటూ ప్రజలందరికీ అందుబాటులో సమాచార హక్కు చట్టాన్ని తీసుకువస్తానని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో సమాచార హక్కు చట్ట కమిషనర్ గా ఇచ్చిన పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రభుత్వానికి పేరు తీసుకువస్తానని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ శ్రీనివాస్ సతీమణి సృజన మాట్లాడుతూ అట్టడుగు స్థాయి నుండి నేడు ఆర్టిఐ కమిషనర్ గా పదవీ బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉంది అంటూనే కుటుంబ బాధ్యతలకు సమయం కేటాయించలేదేమో అనిపిస్తుందని అన్నారు. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీనివాస్ పై ఉన్న నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి జవాబుదారీగా ఉంటారని నమ్మకం ఉందని ఉద్యమం నేపథ్యం కలిగిన శ్రీనివాస్ పదవికి వన్నె తీసుకొస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యమ సహచరుడిగా శ్రీనివాస్ అంతరంగాన్ని తెలియజేస్తూ ఆ చల్లని సముద్ర గర్భం అంటూ సృజన పాడిన పాట సభికులందరినీ ఉత్సాహపరిచింది. ఈ సందర్భంగా ప్రముఖ విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారస్తులు జర్నలిస్టులు ఇతర వర్గాల ప్రజలు పివి శ్రీనివాస్ ఆత్మీయులు ఈ ఆత్మీయ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కమిషనర్ గా తెలంగాణ రాష్ట్రంలో సరైన వ్యక్తికి ఉద్యమ నాయకుడికి దక్కిన గౌరవం అని అన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పీవీ శ్రీనివాస్ పేరు తెలియని వారు లేదంటే అతిశయోక్తి కాదని మాట్లాడారు. అటు కేసీఆర్ హయాంలో అలుపెరుగని పోరాట ధీరుడుగా ఒకపక్క నికార్సైన జర్నలిస్టుగా విధులు నిర్వహిస్తూనే తెలంగాణ ఉద్యమానికి తిరుగులేని పాత్ర పోషించారు.. ఐజెయు జాతీయ నాయ కులు దుద్దుకూరి రామారావు అధ్యక్షత వహించి పీవీ శ్రీనివాస్ తో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. టియుడబ్ల్యూజే ఐ జే యు జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టు కుటుంబం నుంచి వచ్చిన పీవీ శ్రీనివాస్ భద్రాద్రి రామయ్యనే ఎవడబ్బ సొమ్మనీ కులుకుతూ తిరిగేవు రామచంద్ర అంటూ ఎదిరించి మాట్లాడిన కంచర్ల గోపన్నలా సమాజం కోసం పోరాటం చేశారని ధిక్కరించిన స్వరానికి దక్కిన గౌరవమే ఆర్టిఐ కమిషనర్ పదవి అని అన్నారు. టీజేఎఫ్ అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల పక్షాన నిలిచిన వ్యక్తికి సరైన గౌరవం దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, కోనేరు చిన్ని, సింగరేణి ఎడ్యుకేషన్ సెక్రటరీ గుండా శ్రీనివాస్, టీబీజీకేఎస్ మాజీ అధ్యక్షులు ఆకునూరి కనకరాజు, మధువన్ వ్యాపార సంస్థల అధినేత కాకొల్లు నాగేశ్వరరావు, బిజెపి నాయకులు జీవీకే మనోహర్, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు మల్లెల రామనాథం, సీనియర్ నాయకులు మేరెడ్డి జనార్ధన్ రెడ్డి, విద్యాసంస్థల అధినేతలు జేవిఎస్ చౌదరి, మాచవరపు కోటేశ్వరరావు, చైతన్య కృష్ణ, భరత్, సింగరేణి ఎస్సీ సెల్ నాయకులు అంతటి నాగేశ్వరరావు, సింగరేణి లైసన్ ఆఫీసర్ కలువల చంద్రశేఖర్, రుద్రంపూర్ జేఏసీ నాయకులు యాకయ్య, అనుదీప్, పొగరు రాజశేఖర్, బండి రాజు గౌడ్ , కోదాడ శ్రీనివాసరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు చంద్ర నరసింహారావు, వట్టి కొండ రవి, ఏర్పుల సుధాకర్ రావు, ఎర్రా ఈశ్వర్, సీనియర్ పాత్రికేయులు ఎండి వాహబ్, గుణ సురేష్ ,లక్కీ లక్ష్మణ్, అశోక్, వీరు నాయక్, క్రాంతి కుమార్, నాగేశ్వరరావు, కోలా కుమార్, జంపన్న, మురళి, పురం శ్రీనివాస్, జాన్సన్ బాబు, భూపేష్, చాందు రత్న కుమార్ , లక్ష్మణరావు, పురుషోత్తం, కంచు శ్రీను, వినోద్, రామారావు, గీత మధు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.టి.ఐ హక్కుల గురించి దొంగలకే అవగాహన ఎక్కువ

- **ఆర్టిఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్**

**లక్ష్మీదేవి పల్లి, మే 25, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లిలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ ఆర్ టి ఐ చైర్మన్ పివి శ్రీనివాస్ కు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం జిల్లా ముద్దుబిడ్డ తెలంగాణ ఉద్యమ వెన్నెముక పి వి శ్రీనివాస్ కు పార్టీలకు, యూనియన్లకు అతీతంగా తెలంగాణ మిత్రులు వివిధ రాజకీయ పార్టీల రాజకీయ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు జర్నలిస్టులు సింగరేణి కార్మిక సంఘాల నాయకులు న్యాయవాదులు విద్యాసంస్థల అధినేతలు వ్యాపారవేత్తలు పూలదండలు శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రశ్నించే గొంతుగా ప్రజల పక్షాన నిలబడే వ్యక్తిగా తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన పి వి శ్రీనివాస్ ను రాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు కమిషన్ చైర్మన్ గా నియమించడం పట్ల వారు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ చైర్మన్ పి వి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. ఎవరైనా సమస్యను తన దృష్టికి తీసుకువచ్చిన సమయంలో తనకున్న పరిచయాలతో సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేశానని తెలిపారు. ప్రభుత్వం తన మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమాచార హక్కు చట్టం దుర్వినియోగం కాకుండా పటిష్టంగా అమలు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు అదేవిధంగా సమాచార హక్కు చట్టం గురించి సామాన్య ప్రజలకు అవసరమైన వ్యక్తులకు అవగాహన లేకపోవడం బాధకరం అని అన్నారు. దొంగలకు ఈ చట్టం గురించి ఎక్కువ అవగాహన ఉంది కానీ నిజమై న బాధితులకు, ప్రజలకు ఈ చట్టాన్ని ఉపయోగించుకునే అవగాహన లేదని అన్నారు.

## బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమానికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్

- **ఆహ్వానం పలికిన ఉత్సవ కమిటీ**



**లక్ష్మీదేవిపల్లి, మే 25, ప్రజాజ్యోతి :** లక్ష్మీదేవిపల్లి మండలం లాలు తండాలో ఈనెల 29.30.31. నా బొడ్రాయి మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ మహోత్సవ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఉత్సవ కమిటీ ఆహ్వానం పలికింది రాందాస్ నాయక్ మాట్లాడుతూ గ్రామంలో గుడి బడి లేని గ్రామాలు అభివృద్ధికి దూరంలో ఉంటాయని కాబట్టి ప్రతి ఊర్లో గుడి బడి ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వాంకుడోత్ లాలు నాయక్. మాలోత్ గాంధీ నాయక్, సక్రు నాయక్, మాన్సింగ్ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మతల్లిని అధికసంఖ్యలో దర్శించుకున్న భక్తులు





**పాల్వంచ(రూరల్), మే 25,ప్రజా జ్యోతి :** శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)ఆదివారం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో విచ్చేయడం తో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.ఉదయం నుండే పరిసర గ్రామాల నుండే కాక జిల్లా నలుమూలల నుండేకాక ఇతర జిల్లాల నుండి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసినారు.

**★ మాసశివరాత్రి సందర్భంగా పెద్దమ్మగుడిలో రుద్రహోమం**

మాసశివరాత్రిని పురస్కరించుకొని శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మ గుడి)లో "రుద్రహోమం"రోజు ఉదయం ఆలయ ఆవరణలోని యాగశాలలో నిర్వహించబడినది.

**దేవాలయానికి ఏసిని బహుకరించిన -మోదుగు గోపాలకృష్ణ**

శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మ గుడి)కి భక్తుల సౌకర్యార్థం పాల్వంచ,లక్ష్మీదేవిపల్లికి చెందిన మోదుగు గోపాలకృష్ణ,హరికృష్ణ, వెంకన్న, సుజాత సుమారు రూ.38, 000/- విలువ గల ఏసిని అందచే శారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి చైర్మన్, ధర్మకర్తలు,దాతలు పాల్గొన్నారు.

## జాతర మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు





**ములకలపల్లి, మే 25, ప్రజా జ్యోతి:** మండలంలోని చౌటుగూడెం గ్రామంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ వీర్ల అంకమ్మతల్లి,నాగులమ్మ తల్లి,రాజు గొడుగులు జాతర మహోత్సవంలో అశ్వారావుపేట నియోజకవర్గ బిఆర్ ఏస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం భగత్ సింగ్ చెందిన నల్లబెల్లి వెంకటేశ్వర్లు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ జెడ్పిటిసి సున్నం నాగమణి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మోరంపూడి అప్పారావు, ఊకె రవి, మాజీ సర్పంచ్ కీసరి శ్రీనివాస్, సత్యనారాయణ, తానం కృష్ణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు తాటి ప్రవీణ్, ఏసుపాక వెంకటేశ్వర్లు, గడ్డం బాబు రావు, తమ్మిశెట్టి శ్రీను, మీడియం మహేష్, రవి, వాడే రాములు, శివ కృష్ణ, శివ, తాళ్ళ శ్రీను, కంపాటి సొందు, దేవస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## కేవోసీని సందర్శించిన ఇల్లెందు ఏరియా జీఎం



**టేకులపల్లి,మే25, ప్రజాజ్యోతి:** కోయగూడెం ఉపరితల గనిని ఇల్లెందు ఏరియా జనరల్ మేనేజర్ ఈసం కృష్ణయ్య సందర్శించారు. ఆదివారం టేకులపల్లి మండలం కోయగూడెం ఉపరితల గనిని ఇల్లెందు సింగరేణి ఏరియా జిఎం ఈసం కృష్ణయ్య సందర్శనలో భాగంగా కేవోసీ ఓబి కాంట్రాక్టు పనులు నిర్వహించు ఎల్ఎస్ఎన్ కంపెనీ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన భోజన శాలను తనిఖీ చేశారు. కార్మికులతో కలిసి భోజనం చేశారు. అనంతరం గనిని సందర్శించి ఆయన మాట్లాడుతూ ఉత్పత్తులపై దృషి సాధించాలని ఇల్లెందును ఉత్పత్తిలో నెంబర్ వన్ స్థానంలో ఉండే విధంగా అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కేవోసీ మేనేజర్ పెరక శ్రీనివాస్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య ను దర్శించుకున్న మీసేవ రాష్ట్ర అధ్యక్షుడు



**భద్రాచలం ,మే 25, ప్రజాజ్యోతి :**భద్రాచలం రామయ్య ను తెలంగాణ మీసేవ పెడరెషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరా శంకర్ దర్శించుకున్నారు .అనంతరం అయన మాట్లాడుతూ భద్రాద్రి రామయ్య ఆశీస్సులతో రాష్ట్రము లోని మీసేవ నిర్వాహకులు మంచి ఆరోగ్యంతో ,సుఖశాంతు లతో ఉండాలని రామయ్య ను కోరినట్లు అన్నారు . ఆయన వెంట తెలంగాణ మీసేవ పెడరె షన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎర్రోళ్ల బాలరాజు ,జనరల్ సెక్రటరీ మొయిన్ ,ఉదయ్, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కుక్కడపు నరేష్ ,జనరల్ సెక్రటరీ బెల్లంకొండ రామారావు ,ట్రెజరర్ మీసేవ ప్రసాద్ ,వైస్ ప్రెసిడెంట్ భూక్యా రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన భక్తి గీతాలు



**భద్రాచలం కల్చరల్ ,మే 25, ప్రజాజ్యోతి :**భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం సన్నిధిలో ఆదివారం హైదరాబాదుకు చెందిన ఆవుల శ్రీలాస్య ఆలపించిన కర్ణాటక సంగీత భక్తి గీతాలాపన భక్తులను అలరించింది. డా. అశ్విన్, రాయప్రోలు సుబ్రహ్మణ్య శర్మ, కే జగన్మోహిని తదితరులు సంగీత సహకారం అందజేశారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పై ఆలపించిన భక్తి పాటలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## భారీ వృక్షం పడి ఐదు గంటలు ట్రాఫిక్ జామ్





**టేకులపల్లి,మే25,ప్రజాజ్యోతి:** సీతారాంపురం గ్రామ సమీపన భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడి కొత్తగూడెం ఇల్లందు ప్రధాన రహదారిపై ఐదు గంటల భారీ ట్రాఫిక్ జామ్ అయినది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు భారీ వృక్షానికి నిప్పు పెట్టి మొదలు బాగా మొత్తం కాలిపోవడం వలన కొమ్మల బరువుకి రోడ్డుకి అడ్డంగా పడిపోవడం జరిగింది. ఇట్టి భారీ వృక్షాన్ని టేకులపల్లి సిఐ తాటిపాముల సురేష్, ఎస్సై ఏ.రాజేందర్ పోలీస్ సిబ్బంది. మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, మిషన్ కట్టర్ సేవియా, జేసీబీ సహాయంతో రోడ్డుకి ఇరువైపులా చెట్లు కొమ్మలను నెట్టివేసి భారీ ట్రాఫిక్ జామును క్లియర్ చేశారు.